"ఇది- పార్కు" "నువ్వు మరీ అందంగా ఉన్నావు మరి. ఇక్కడ చీకటిగానే ఉందిగా- ఫరవాలేదు"

"ఉహుం చీకటేమిటి, అవతల వెన్నెల వొచ్చేస్తూంటే"

"జానుకో. కాని.. మనం... పార్కులో కొంచెమయినా ప్రేమించుకోవాలిగా..." అంటూ అమె నొక్కసారి కౌగలించుకుని... చిన్న ముద్దు పెట్టి... వొదిలాడు.

ఇద్దరు నడుస్తూ- ఆనందంగానూ ఆశ్చర్యంగానూ-

మనసులో అనుకున్నారు – "కొత్త జీవితం ప్రారంభమౌతూంది".

✡ ✡ ✡ ✡ ✡

# లాటరీ

దేముడు మహామంచివాడు. అమిత చెడ్డవాడు! ఈతకాయ చూపి తాటికాయ లాక్కుంటాడు. అదో ఆట. అంతే.

'ఎదవ బతుకు' – కసిగా పెదవి కొరుక్కున్నాడు రాములు- మందుల షాపు మెట్లుదిగుతూ. పేదవాడికోపం పెదవికి చేటని రుజువౌతూ అతని పెదవి చిట్లి మంట పెట్టసాగింది.

గుండెలలోనూ మండుతూంది. కన్నీళ్ళాపుకుందుకయితే రెప్పలున్నాయి. గుండెమంట లారేదెలా? ఒక్కసారి పిడికిలి విప్పి చూసుకున్నాడు. నలిగి- మాసిన నోట్లు కనిపించాయి. మూడ్రెళ్ళా, ఓ ఐదు... వెరసి పదకొండు. చాలదు. మరో పది కావాలి. సీసా ఖరీదు ఇరవై ఒకటి. సీతాలు చావుబతుకు సందిలో పడుంది. నులిక మంచం మీద మాంసం ముద్దలా పడుంది. మందుపడితే కాని మంచం దిగదు. దిగలేదు. వేగంగా పడాలి సూదిమందు. సూదిమందంటే- ఇరవయ్యొక్క రూపాయలు. డాక్టరు బాబు యిట్టే రాసి మొహం మీద విసిరేశాడు చీటి. చీటీ రాసెయ్యడానికేం, చిటికంత సేపు, సూదిమందు కొనాలంటే చచ్చే చావౌతుంది. డబ్బున్న మారాజుకి బతుకు బాధేం తెలుస్తుంది? రిచ్చా తొక్కడమంటే బుర్రున కారు తోలడం కాదు. ఐనా పేదోళ్లకి జబ్బులేమిటి? డబ్బున్న వాళ్లకి కాని. చక్కనమ్మ చిక్కినా సన్నబట్ట మాసినా అందమే అన్నట్లు డబ్బు కలవారికి జబ్బులొచ్చినా సుఖమే. పేదోళ్ళకి- గంజి నీళ్ళందడమే గగనంగా ఉన్న గడ్డు రోజుల్లో పెద్ద జబ్బులొస్తే ఖరీదయిన మందులెలా కొనగలరు? అదేమిటో యిసిత్రం. నదులన్నీ సముద్రంలోనే చేరేటట్లు కలవారినే వరిస్తుంది సిరి. నిన్నా యివాళా ఎండనక వాననక పగలనక రాత్రనక కండలు కరిగేలా రిచ్చా తొక్కితే అద్దె డబ్బులు పోను మిగిలిందెంత? ఇరవయ్యొకటి కాదు, పదకొండు మాత్రమే.

కాళ్ళు నొప్పెట్టేలా, ఎముక విరిగేలా వొళ్ళు హూనమయ్యేలా రిచ్చాబండి లాగి రూకలు సంపాదించంది – కూడబెడదామనీ కాదు, కూచుని కులాసా సేద్దామనీ కాదు. సీతాలుని రచ్చించు కుందామని.

సీతాలు... సీతాలంటే తన ఆడది. అదే తనకి ఆడదీ పెళ్ళామూ ప్రియురాలూ అన్నీనూ. వేమన్నో మరెవడో అన్నట్లు పేదోడికి పెళ్ళావే భార్య. అదే ప్రియురాలూ, బయోస్కోపుల్లో లాగా ప్రేమించుకుని రోడ్లంట తిరక్కపోయినా, పార్కుల్లో పడి దొర్లకపోయినా- సీతాలూ తనూ మనసుపడీ మోజుపడి మనువు జేసుకున్నారు. అప్పటినుంచీ ఒకరి బతుకొకరిదిగా మసులుకుంటున్నారు. ఆడదంటే - ఏడికి చలవ, చలికి వెచ్చన. సీతాల్లేకపోతే తనకి బతుకే లేదు. అది తన ప్రాణం. సీతాలు మంచ మెక్కేసరికి తన మనసేదో ఐపోయింది. డాక్టరు బాబు యింగిలీసులో జబ్బు పేరేటో కూశాడు కానీ తనకి కుసింతయినా అర్థం కాలేదు. తెలిసింద్లా ఒకటే. సూదిమందు కొనాలి. అందుకుఇరవై ఒక్క రూపాయలుండాలి.

సూది మందేస్తే - సీతాలు మంచం దిగి మామూలు మనిషౌతుంది. మందుపడాలి. మంచి తిండి పడాలి. అప్పుడే సీతాలు మనుషుల్లో పడుతుంది. అందుకు డబ్బు కావాలి.

డబ్బెలా వొస్తుంది?

జేబులు కొడితే - డబ్బేనా దొరకొచ్చు, దెబ్బలేనా తగలొచ్చు. జైలులో కూర్చోనయినా కూర్చోవచ్చు, కాని - జేబులు కొట్టడం తనకి రాదు. తనకొచ్చినదొకటే - రిచ్చా బండి లాగడం.

రిచ్చా తొక్కితే లచ్చలు రావు బయోస్కోపుల్లో తప్ప. రాతిని పిండితే రతనాలు రాలుతాయా! నిన్నా నేడూ బేరమాడకుండా కదిలిన చక్రం ఆగకుండా రిచ్చా తొక్కితే మిగిలినదెంత? పదకొండ్రూపాయలు. సూదిమందులో సగం.

తెల్లారేసరికి డాక్టరు బాబు కాడికి సీతాల్ని తీసుకెల్లాలి. సూదిమందిప్పించాలి. లేకపోతే సీతాలు తనకి దక్కదు.

దాన్నొగ్గి బండి లాగుతూ ఊరంట తిరగడం - మనసు బెంగగానేఉంది. కాని- ఏటి సెయ్యగలడు? తప్పదు. డబ్బులు కావాలంటే బండిలాగవలసిందే. డాక్టరుబాబు మాటవిన్న కాణ్నుంచీ యిరవై ఒక్క రూపాయలే నిండిపోయాయి ఊహల్లో. ఇరవై ఒక్క రూపాయలు. చేతిలో ఉన్నవి పదకొండు. కావలసినవి మరోపది ఎలా? దేవుడా, దారిసూపు. సీరామ చెందరమూర్తీ. ఆడది లేకపోతే మగాడి కెంత బాదో నీకు తెల్సు. మరి నన్ను నువ్వే కాపాడాల. సల్లగా సూడాల. నా సీతాల్ని నా కుణ్నీయాల. రాములు నడుస్తున్నాడు. కాళ్ళు పీకుపెడుతున్నాయి. నోరెండిపోతూంది. ఎదురుగా సోడాబడ్డీ కనిపించింది. రాములు కాళ్ళటు లాక్కుపోయాయి. రిచ్చావాళ్ళకీ సోడాకీ అవినాభావ సంబంధముంటుంది.

రకరకాల సీసాలలో రంగురంగుల ద్రవాలు ఆకర్షిస్తున్నా- సోడాయే కొట్టమన్నాడు. గోలీసోడా బుడ్డిలో- సోడాలేదు. నీళ్లున్నాయి. ఆ నీళ్ళయినా ఏ పీతల కోనేరునుంచో తెచ్చిపోసిన నాచునీళ్ళలా కంపుకొడుతున్నాయి కాని మంచినీళ్లలా ఎంత మాత్రమూ లేవు. వాటిలో గ్యాసులేదు. గోలీ మాత్రం కయ్యిమంటూ ఆర్భాటంగా అరిచింది. కిమ్మనకుండా బుడ్డెత్తి సోడా లాగించేశాడు రాములు. బాగా కష్టపడిన రోజున సారా తాగడం అలవాటు వాడికి. సారా తాగినా పెళ్ళాన్ని ప్రేమిస్తాడే తప్ప చితకతన్నడు. బూతులు కుయ్యడు. వాడు సారా తాగినా సీతాలు రాముల్ని ప్రేమిస్తూనే ఉంటుంది. ఎందుకంటే రాములు తాగుబోతు కాడు. తాగడం వాడి వంటికి అవసరం- అని సీతాలుకి తెలుసు.

సోడా తాగిన రాములికి బడ్డీ అంచున ఓ మూలన పెట్టిన కిరసనాయిలు బుడ్డి కనిపించింది. చిమ్నీలేని ఆ దీపం చీరలేని ఆడదానిలా ఉంది. దాని పక్కన సీసా. దాన్లో నీళ్లలాటి కిరసనాయిలు.

అందులో ఓ పుల్ల. ఆ తతంగం చూసేసరికి వాడికి బీడీ కాల్చాలనిపించింది. గుర్రం బీడీ కాని అంటించాడు. పొగ గుండెల్లో కెళ్ళేసరికి ఉషారుగా అనిపించింది. అంతవరకూ మొద్దుగా ఉండిపోయిన అవయవాలు చురుకెక్కించుకున్నాయి.

"ఇంద ఇంద తీసుకో" గ్రామఫోను రికార్డు వినిపించింది. అటు చూశాడు. లాటరీ బల్ల... గ్యాసు లైటులో మెరిసిపోతూంది, చక్రం గిర్రున తిరుగుతూంది. రికార్డులు గుమ్మెత్తించేస్తున్నాయి. "కాయ్ రాజాక్కాయ్.." అరుస్తూ ఆహ్వానిస్తున్నాడు లాటరీ బల్లవాడు "ఒకటికి మూడూ... రెండుకి ఆరు..." ఆశపెడుతున్నాడు. పదికి? లెక్కేసుకుంటే ముప్ఫయ్ తేలింది.

రాములు కళ్లు మెరిశాయి. మనసు లాగింది. ఆశ పీకుతూంది. కాళ్లు తొందరచేశాయి. లాటరీ బల్ల ఊరించింది.

లొంగిపోయాడు.

పావలా కాశాడు– రాణీ బొమ్మ మీద. అదృష్ట చక్రం గిర్రున తిరిగి తిరిగి ఆగింది. రెండు రాణీ బొమ్మలూ... పావలాకర్ధ రూపాయి, అందిస్తూ చెయ్యిగిల్లి నవ్వాడు లాటరీ వాడు.

రాములు పొంగిపోయాడు.. ఇవాళ తన కదృష్టం పట్టబోతూంది. మొత్తం యిరవై ఒకటీ ఐపోతే– సీతాలుకి మందుకొని– ఊహలలో తేలిపోతూనే లాభం వచ్చిన అర్ధ రూపాయి కాసుని పల్లకి బొమ్మ మీద పెట్టాడు కళ్ళకద్దుకుని.

చక్రం కిర్రుమని తిరిగింది. అది ఎంతవేగంగా తిరుగుతూందంటే అసలది తిరగడం లేదేమో అనే భ్రమ కలుగుతూంది చూసేవాళ్లకి. ఎన్నో కళ్ళు.... వాటిలో రాముని కళ్ళు... ఆ చక్రాని కంటిపెట్టుకుని తిరుగుతున్నాయి. అప్పుడే సంవర్తాడి పైటేసిన పడుచుపిల్లలా చక్రం ఒకంతట ఆగడం లేదు. మురిపించి మురిపించి వేగం తగ్గిస్తూంది మెల్లమెల్లగా.

మొదటాట ఐపోయింది. రోడ్లు కొంతసేపు కిటకిటలాడి పోయాయి. లాటరీ బల్లదగ్గర రష్ పెరిగింది. అర్ధకి రూపాయొచ్చింది లెక్కవేసుకోసాగాడు రాములు. రూపాయికి రెండు... రెండుకి నాలుగు.... నాలుక్కెనిమిది.. ఎనిమిదికి పదహారు.. చాల్చాలు సీతాలుకి మందు వొచ్చేస్తుంది...

రూపాయి నోటుని ఏనుగు మీద పెట్టాడు దేముణ్ని తలుచుకుని...

చక్రం తిరిగి తిరిగి ఆగింది. నాలుగేనుగులు! నాలుగు రూపాయలు...

రాములు నోట్లందుకుని బీడీ అంటించి ఉత్సాహంగ దమ్ములాగాడు నాలుక్కాయడమా రెండే కాయడమా అన్న మీమాంసలో పడిపోయాడు. బీడీ దమ్ము గట్టిగాలాగి రెండ్రూపాయలు తీసి రాణీ బొమ్మ మీద పెట్టాడు.

రికార్డులు మోతెక్కించేస్తున్నాయి. రాములుని చూసి మరో యిద్దరు రాణీ బొమ్మమీదే చెరో రూపాయీ వేశారు.

ఈసారి పల్లకీ వచ్చింది. రాణీబొమ్మ కనపడకుండాపోయింది.

✡ ✡ ✡ ✡ ✡